పిల్లికి చెలగాటము—ఎలుకకు ప్రాణసంకటము

శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మగారు

సీత దొడ్డివసారలో కాఫీకాస్తోంది. రామారావు కచేరిహాల్లో వాలుకుర్చీలో పడుకున్నాడు. ఇంతలో పోష్టుమ్యాన్ వచ్చి వుత్తరములు పత్రికలు అందిచ్చాడు రామారావుకు. అన్నీ వరసనే విప్పిచూచి వకసంచిక చేతబట్టుకుని చూస్తూ పిలిచాడు సీతను.

బంట్రోతువచ్చి వుత్తరములు ఇవ్వడం చూచింది సీత. ఇంతలో భర్తపిలిచేసరికి ఏదో తనపుట్టింటినుంచి వుత్తరం వచ్చింది కాబోలు అనుకుని వడివడిగావచ్చి 'ఏమండి! మాతమ్ముడు వుత్తరం వ్రాశాడా' అన్నది సంతోషంగా.

'ఉత్తరములేమి రాలేదు. ఈ సంచికమీది బొమ్మ చూడు' అన్నాడు రామారావు నవ్వుతూ.

'ఇందుకేనా పిలిచింది? ఇంకా ఏదన్నావుత్తరమో లేక పత్రికలో ఏదన్నా గొప్పసంగతులున్నవో అనుకున్నాను. ఏమున్నది చూసేందుకు?' అన్నది చిన్నబోయిన ముఖంతో సీత.

'సరే కాఫీతీసుకురా తరువాత మాట్లాడుదాం' అన్నాడు రామారావు.

కాఫీతెచ్చి చల్లార్చిఇస్తున్నదిగాని పత్రికమీది చిత్రపటము సీత మనస్సును కలచివేస్తూనే వున్నది.

'సీతా! ఎందుకల్లా కూర్చున్నావు. ఏదో ఆలోచిస్తున్నట్లున్నావే? కాఫీ త్రాగునీవుకూడా' అని తాను త్రాగి కప్పు అందిచ్చాడు సీతకు.

'వేరే ఆలోచనేమీలేదు. ఆరోజు కారోజు స్త్రీలు ఎంత చులకదనముగా ఎంత హేయముగా చూడబడుతున్నారు అని ఆలోచిస్తున్నాను గాని వేరే యేమీలేదు. ఇవ్వాళ నాకు వికారంగావున్నది. కాఫీ అక్కరలేదు' అని కప్పు అవతలకుత్రోసి గోడకు చేరబడి కూర్చున్నది సీత.

'సీతా! ఎవ్వరో చిత్రపటము వ్రాసినారని నామీద అలిగి కాఫీత్రాగకపోతే ఏంలాభం? పురుషులంతా వక్కటేకదా అని కాబోలు నీ అభిప్రాయం?' అన్నాడు రామారావు కొంచం కోపసూచకంగా.

'ఎవరో వ్రాసిన వాళ్లమీద కోపంగావుంటే మీకెందుకూ కోపం? నేనేమి అనందే?'

'మా పురుషుడే కనుక నాకు కొంచం కోపం వస్తుంది.'

'అల్లాగా? ఇల్లాంటి బొమ్మలు వేశారంటేనే మీకు కోపంవస్తూంటే? ఈ బొమ్మలు చూస్తూంటే మా కెల్లావుండొచ్చునో మీరే చెప్పండి? పూర్వకాలము స్త్రీలు ఎంత గౌరవముగా చూడబడ్డారో ఎంత అమూల్యమైన వస్తువుగా వాడబడ్డారో ఇప్పుడు అంత చులకదనముగావున్నారు పురుషుల కలముక్రింద స్త్రీలు. ఈ వ్రాతలు, ఈ చిత్తరువులు చూస్తూవుంటే మహారణ్యములో అగ్నిలేకుండా వాటంతటవే దహించుకొనిపోయే వృక్షాల్లాగవున్నాయి మా స్త్రీల హృదయాలు. స్త్రీలు కోమలహృదయులు. వెన్నవంటి మనస్సుకలవారు. వెన్న పొయ్యిసెగను పెట్టితే కరగినట్లుగా మీ కలంపోటులు సెగలకు కరగిపోతున్నవి. స్త్రీలు ఈ చిత్తరువులను చూచి తలలు వంచుచున్నారు' అన్నది సీత నేలవంక చూస్తూ.

'ఐతే! సీతా! నేను వక్కమాట అడుగుతాను కోపము రాదుగదా?'

'కోపమెందుకూ? మాకు కోపమొస్తుంది అనే గౌరవమరియాదలు మీకు మాయందుంటే ఈ పత్రికలను ఇంతదూరము తెచ్చి వృద్ధిచేస్తారా?' అన్నది సీత.

'ఎన్నడూ ఎక్కువగా మాట్లాడి ఎరుగని నీవు ఇంత తీవ్రముగా మాటాడుటకు వీటివలన మీకు

కలిగిన నష్టమేమున్నది?' అన్నాడు రామారావు నవ్వుతూ.

'మీకు సంతోషము; మాకు దుఃఖము. నష్టము గాకేమి? గౌరవనష్టముకంటె ఇంకేమి నష్టము కావాలి? డబ్బు నష్టమైతే మళ్లీ సంపాదించుకో వచ్చు. గౌరవం నష్టమైతే ఎల్లావస్తుంది? అనాది నుండి భారతస్త్రీలు ఎంత గౌరవముగా తమ శీల మును కాపాడుకొనుచున్నది మీకెల్లరకు తెలిసిన విషయమే. అట్టిసంతతికి చెందిన మాయెడల నేడు ఈవిధముగా వస్త్రవిహీనములగు చిత్తరువులను వ్రాసి ప్రదర్శిస్తూంటే మా హృదయాలు ఎంత వేదనపడు తున్నాయో మీ కేం తెలుస్తుంది? సీతా, సావిత్రి, అనసూయ, దమయంతి, ద్రౌపది మున్నగు పతివ్ర తామతల్లులు తమ శీలముకొరకు యెన్నో కష్టములు అనుభవించిరి. పద్మిని, రాణీసంయుక్త మున్నగు రాజపుత్రస్త్రీలు ప్రాణములు సైతము కోల్పోయినది జగత్ప్రసిద్ధము. అట్టి పూజనీయమగు స్త్రీమూర్తిని నవీనకాలపు చిత్తరువులవల్లను, వ్రాతలవల్లను ఎట్లు హేయము చేస్తున్నారు చూడండి. ఇంత శోచనీయము ఇంకొకటి కలదా? మా స్త్రీలలోకూడా ఎంతమందియో కథకులున్నారు; ఉపన్యాసకు లున్నారు; కవయిత్రులున్నారు; చిత్రకళానిపుణు లున్నారు. ఎవ్వరైనా ఎప్పుడైనా పరుల నగౌరవ పరచుట ఏగ్రంథములలోనైనా ఏ పత్రికలలోనైనా చూచారా చెప్పండి' అన్నది సీత గద్గదకకంఠముతో.

'సీతా! నీవు ఇంత కసివెళ్లపోయుచున్నావు గాని నేను చెప్పిన బొమ్మలు మన దేశపువి కావు. మీరు కూడా నవీనులే కదా పత్రికనుమాత్రము నవీనం అని ఆక్షేపించుటెందుకు? మీమీద వ్రాశామా అంటావే? వ్రాయరాదూ చూద్దాం' అన్నాడు రామారావు గరువంగా.

'అంత గరువంగా మాట్లాడుతున్నారు మేము వ్రాయముకదా అని కాబోలు? ఇటువంటి హేయపు ప్రసంగముతో మాకు పనిలేదు. మేము నవీనులమైతే కావచ్చుగాని మా హృదయాలుమాత్రం నవీనములు కావు. స్త్రీ నవీనగాని పూర్వాచారపరాయణి గాని తన ధర్మమును తన శీలమును తన భక్తిని విడనాడదు.

'నీ వెన్నడు ఈవిధముగా మాట్లాడలేదంటారు. ఎప్పుడు నోటిచేదలాగ మాట్లాడితే యేంలాభం? సమయం వచ్చినప్పుడు మితముగా మాట్లాడినంతమాత్ర మున మాకేమి తెలియదనుకుంటున్నారు కాబోలు? సమయంవస్తే మేముగూడ రాజ్యాంగవిషయాల్లోగాని, ఉద్యోగాల విషయాల్లో గాని, రణరంగములలోగాని మీకుతీసిపోము. మితముగా మాట్లాడినంతమాత్రమున స్త్రీకి ఒక వ్యక్తిత్వముకూడా లేదని తలంచి ఆటవస్తు వుగా భావిస్తున్నారు కాబోలు. స్త్రీయొక్క ఆశయ ములు, తెలివితేటలు గౌరవమరియాదలు నిప్పుమీద నివురుకప్పిన చందముగావుంటాయి గాని స్త్రీ అబల కానేరదు. అవసరము వచ్చినప్పుడు స్త్రీయొక్క తెలివితేటలు కార్యశూరత వుపయోగించును గాని అనవసరప్రసంగము కలుగచేసుకునే వ్యక్తికాదు స్త్రీ.

'ఆస్త్రీలు మన దేశపువారు కారు అని చెప్పినంత మాత్రమున మా హృదయాలు శాంతించునా? ఏ దేశపువారైననేమి. జాతిఅంతయు వక్కటేకదా? ఆబొమ్మలు చూచి నేను సహించలేనండీ' అని అక్కడనుంచి లేచి వెళ్లింది సీత.

'సీతా! ఈ కోపమ్మీద వంట ఆలస్యంచేసేవు సుమా నేను అర్జంటుగా ఆఫీసు వెళ్లాలి' అన్నాడు రామారావు.

'మా కల్లాటివేషాలేమీ లేవు. కోపమొచ్చి వంట ఆలశ్యం చెయ్యడం, మాట్లాడకపోవడం. ఇల్లాంటి అవగుణాలు మాదగ్గరుంటె యెక్కువేమున్నదీ? మాకు ఎల్లప్పుడు వక్కటె నోరు, వక్కటె మనస్సు' అన్నది సీత స్నానానికి వెళ్లుతూ.

సీత జాత్యభిమానం కలది. పతిభక్తి దైవభక్తి ఆమె ముఖ్యవ్రతాలు. ఎన్నడు భర్తకు ఎదురు జవాబుచెప్పి ఎరుగదు. ఇప్పుడు జాతివిషయమైన ఘర్షణలో మాట్లాడక తప్పిందికాదు. ఆమె మనస్సే ఆమెను తొందరపెట్టింది. తొందరపడి ఏమి మాట్లాడాము అనుకుంది. సమయం వచ్చినప్పుడు మాట్లాడకపోతే ఎల్లాగా అని తనకుతానే సమాధానపరుచుకుంది.

౨

రామారావు చాలా తెలివికలవాడు. తనఉద్యోగమేమో తనపనేమోకాని ఒకరిజోలి ఒకరిప్రస్తావన కలుగజేసుకోనేవాడు కాడు. బాగా చదువుకున్నవాడు కావడంచేత ఎప్పుడన్నా తనభావాలు వెలిబుచ్చేకొరకు ఏదోవక వ్యాసముగావ్రాస్తూవుంటాడుగాని ఒక వ్యక్తినిగురించిగాని వ్రాసేవాడు కాడు. సమయం వచ్చిందిగనుక కొంచంసేపు తమాషాకు భార్యతోఘర్షణగా మాట్లాడటమేగాని ఆయన మనస్సులో స్త్రీవిషయాన్నిగురించి నిశ్చితమైన ద్వేషాలేమీ లేవు.

సీత! వంటచేస్తున్నదిగాని ఆమెమనస్సులో చిత్తరువులనుగురించి ఆలోచిస్తూనేవున్నది. వస్త్రవిహీనములగు బొమ్మలు ఆమె కన్నులఎదుట కనిపించినట్లేవున్నది ఆమెమనస్సుకు.

'ఇవ్వాళ సమాజములో ఈచిత్తరువులను ఈ వ్రాతలనుగురించి మామెంబర్లందరును ఆలోచించి ఒక తీర్మానముచేసి పత్రికాధిపతులకు తెలియజేయా' లనుకున్నది. వంటతయారుచేసి భర్తరాక కెదురు చూస్తున్నది సీత.

'సీతా! పదిన్నరైంది వంటైందా?' అన్నాడు రామారావు రెండుచేతులా దరవాజపట్టుకు తొంగి చూస్తూ.

'వంటై చాలాసేపైంది. మీరాక కెదురుచూస్తున్నాను' అన్నది సీత ఎదురుగావచ్చి.

'వంటైతే నీదేవతార్చనైందా?'

'నాకేమి దేవతార్చన?'

'ఏదో గంటవాయిస్తావుగా అందుకని అన్నాను' అని పకాపకానవ్వాడు రామారావు.

'ఇందుకే మీకు వినపడకుండా చేస్తాను. దేవుడంటె అంతనవ్వెందుకు చెప్పండి?' అన్నది సీత దీనంగా.

'బాబోయి దేవుణ్ణంటె కళ్లుపోతాయని నాకు మట్టుకు తెలియదూ? నీవే మరిచిపోతావని జ్ఞాపకము చేశాను. దేవుడంటె నాకు ప్రేమే.'

'ప్రేమవుండి మనమేం పెడుతున్నాం దేవుడికి? చూపులు వారివి మేపులు మనవి అని పెద్దలు చెప్పినట్లు దేవుడికేం కర్చుపెడుతున్నాం మనం?'

సీత కంచము చెంబు పీటా అన్నీ సిద్ధంచేసి వడ్డన పూర్తిచేసింది.

రామారావు స్నానంచేసి పట్టుపంచ కట్టుకుని భోజనానికికూర్చుని సీతముఖమువంక తేరిపారచూచి 'ఏదో ఆలోచిస్తున్నట్లున్నావు?' అన్నాడు.

'ఏమీలేదు మీరు భోజనంకానియ్యండి.' అన్నది సీత.

భోజనం అవుతూవుంది. 'ఆలోచనేమిటో చెప్పావుకాదేం?' అన్నాడు రామారావు.

'చెప్పకేమీ? మీకు చెప్పకుండా ఎల్లాచేస్తానూ? ఇవ్వాళ సమాజానికి వెళ్లుతాను కాఫీకి తొందరగా వస్తారా? అన్నది' సీత బెదురుచూపులతో.

'ఇందుకేనా ఇంతఆలోచన? ఏమో బెదిరిపోతు అడుగుతున్నావు. కాఫీకి రావడానికి తీరుబడి కాదు. హోటల్లో పుచ్చుకుంటాను నీఇష్టంవచ్చినప్పుడు వెళ్లు.'

రామారావు భోజనంచేసి వెళ్లిపోయాడు.

గోడనున్న గడియారం మూడుగంటలు కొట్టింది. స్త్రీసమాజానికి సీతే కార్యదర్శి. గనుక మధ్యాహ్నం మూడుగంటలకల్లా మెంబర్లందరికీ నోటీసు పంపింది. తానుకూడా తలదువ్వుకుని ప్రయాణమై వెళ్ళింది సమాజానికి. మెంబర్లంతా వచ్చి సభ చేశారు.

3

'ఏం. సీతా! మీ మీటింగులో ఏమి తీర్మానాలు చేశారో?' అన్నాడు రామారావు.

'మేము ఏంచేస్తే మీకెందుకూ? అంత తొందర పడుతున్నారు?'

'ఏమిలేదు వూరికేనే విందామని'.

'అహ—అదివాదులెండి. తమరుకూడా వ్యాసకర్తలేగనుక అడుగుతున్నారు. లేకపోతే మేమేంచేస్తే మీకెందుకూ? చెప్పండి? మా సమాజంలో ఈవేళ ప్రసంగాలు జరిగినతరువాత నేను జదివినతీర్మానం ఇది. 'పత్రికలు వ్రాయుచున్న వ్రాతలు వేయుచున్న చిత్తరువులు చూచి స్త్రీలహృదయాలు చాలా వేదన పడుచున్నవని ఇక్కాలపు కథకులు చిత్రకారులు తెలుసుకొనవలెనని ఈసభవారు హెచ్చరించుచున్నారు.

'మఱియు వ్యాసకర్తలూ చిత్రకారులూ తమ కళానైపుణ్యతను కథాకౌశలమును, వాక్యచాతుర్యమును, చిత్రరచనాపటిమను సద్వినియోగముచేయక వృథా చేసుకొనుచున్నారు గదాయని ఈసభవారు విచారించుచున్నారు.

'ఇకముందు ప్రచురింపబడే గ్రంథపత్రికాదులలో ఈవిధమగు వ్రాతలనూ, చిత్తరువులనూ నిషేధించవలెననియు వ్రాయువారిని మందలించవలెననియు ఈ సభవారు పత్రికాధిపతులనూ ముద్రాలయాధికారులనూ ప్రార్థించుచున్నారు.'

అందరు విని ఆమోదించారు' అంది సీత.

'మీ స్త్రీలమీద ఎవ్వరు వ్రాస్తున్నారని స్త్రీలందరు ఇంతకట్టుగట్టి ఇంత అలజడి చేస్తున్నారు. మాకు మట్టుకు అల్లావుండదూ? మీరు వ్రాశారని.'

'ఆభయం మీకెప్పుడువద్దు. ఇదివరకు వ్రాయలేదు. ఇప్పుడు వ్రాయటంలేదు. ఇకముందు వ్రాయము అని మా స్త్రీలందరితరఫునా నేనే చెప్పగలను. మాకు పురుషవర్ణనతో పనిలేదూ అని వ్రాసిఇవ్వమన్నా ఇచ్చుటకు సిద్ధముగావున్నాను' అన్నది సీత ధైర్యంగా.

'సీతా! నేను ఎప్పుడన్నా స్త్రీలవర్ణనతో కథలు వ్రాశానేమో చెప్పు?'

'వ్రాయకేమి? అంతా ఇల్లాగే అంటారు. ఎక్కువగా వ్రాయకపోయినా సమయంవచ్చినచోట పువ్వొత్తుల్లో సూరేకారంలాగ వాక్యాలు వేస్తునేవుంటారు. చక్కని స్త్రీ అంటే అందరికి అర్థంకాదూ? ఆమె నిలువంతా వర్ణించడమెందుకు? ఇక ఆపత్రికలమాట తలపెట్టకండి నాకు వళ్ళుమండుతుంది. ఇదిగో తమలపాకుల చిలకలు.'

'.........'

'పుచ్చుకోండి. అదుగో రాధ కదులుతున్నాడు లేచి ఏడుస్తాడు.'

'పత్రికలంటేనే కారంచల్లినట్లు మండుతున్నదే నీకు? నాకెందుకు మీగొడవ తమలపాకులు ఇల్లా ఇయ్యి.' అని పక్కున నవ్వాడు వికటంగా రామారావు.

'అల్లాగే వుంటుంది. మీరుచేసేపని మీకు నవ్వుగాకపోతే చేస్తారా? 'పిల్లికి చెర్లాటం ఎలుకకు ప్రాణసంకటం' అన్నట్లు మీకు నవ్వు మాకు దుఃఖం' అని తమలపాకులు ఇచ్చి చివ్వునలేచి వెళ్ళిందిసీత. తెల్లవారితే మామూలే. అలుమొగళ్ళతగువు అద్దమ్మీద పెసరగింజ దొర్లినంతసేపేగా.